"ఏ రోజూ అలా గేవుంటారు. మీలాంటివారే అరుదు" అన్నాడు కవిరాజ్ గౌరవపూర్వకంగా.

"అవున్లెండి. తమవంటి వారికోసం కాకపోతే మరెవరికోసం వెడతారు ప్రజలు! సూదంటురాయి లాగా మీ విద్య వారిని ఆకర్షిస్తోంది! మీ మనసు వెన్నపూస! మీ మాటలు తేనెతేటలు! ఏమి పండితులండీ మీరు! మీరు యిటీవల వ్రాసిన ఖండకావ్యంలోని చచ్చిపోయిన మీ ఆవుదూడ కోసం లోకం దుఃఖించింది కదుటండీ!" ఒణుకుతున్న పెదవులతో అన్నాడు సుందర్రావు.

"ఆవుదూడ చావలేదే!"

"చావని దూడని చచ్చినట్లు, మరణించిన భార్యని సజీవగా వున్నట్లు ఎలా వ్రాయగలిగారండీ! జరిగినవి వ్రాయడం సులభమే. కాని, జరగనివి జరిగినట్లు వ్రాయడం వ్రాసి ప్రజల మన్ననలను పొందగలగడం చాలా కష్టం! గొప్ప విషయం! కవిరాజ్, మీకు నా నమశ్శతాలు" అంటూ లేచి నిలబడి చేతులు జోడించాడు నమస్కార పూర్వకంగా సుందర్రావు.

కవిరాజ్ ముఖంలో ఒక్క క్షణం ఆశ్చర్యం కనబడింది. మరుక్షణంలోనే చిఱునవ్వు మెరసింది.

"సుందర్రావుగారూ, నేను వైద్యంలో కవిరాజ్‌ని. మీరు చూడదలిచిన కవిరాజ్ కవి. వెనక వీధిలో సరిగ్గా యీ యింటికి వెనుక వుంది మీ కవిరాజ్ యిల్లు" అంటూ వీధి గుమ్మందాకా వచ్చి సాగనంపాడు సుందర్రావుని కవిరాజ్.

---

స్కెచ్

# "అడవి మృగం"

ద్రోణంరాజు కృష్ణమోహన్

"ఆ అమ్మాయి చూడు! ఆ అలంకారం అదీ ఎలా వున్నదో!" అటువైపు చూస్తూ అన్నాడు రఘు. మూర్తి అటు తిరిగి చూశాడు. పల్లెటూరి పడుచు నీళ్ళబిందె ఖుజాన పెట్టుకు నడుస్తోంది.

"నిజమే. చాలా మోటు అలంకారమే. కాని ఎంత అందగత్తె!"—వర్ణించాడు మూర్తి తనకు పరిచయమైన కవితాపదజాలం ప్రయోగించి.

"ఎంత రతీదేవిలా వుంటే మాత్రం ఏంలాభం? పొట్ట చీరిస్తే అక్షరం ముక్క లేదు. అలంకారం చూస్తే పరమ అసహ్యం. అబ్బ యీ పల్లెటూరి ఆడవాళ్లు—"

తన విసుగంతా చూపించాడు యిహ మాట్లాడలేక.

"చదువులేకపోతే మానె. ఆ అలంకారమన్నా తీసెయ్యకూడదూ?" మూర్తి అభిప్రాయం.

"అంతమాత్రాన ఒరిగేదేమిటీ! చదువు ముఖ్యం. కనీసం స్కూల్ ఫైనల్ ఐనా అయివుండాలి. ఆ అమ్మాయి ఐదో క్లాసన్నా చదివిందో లేదో?" రఘు ఆ అమ్మాయిని గురించి అంత గట్టిగా ఎందుకు మాట్లాడుతున్నాడో తెలియలేదు మూర్తికి.

"పోనీ కనుక్కోమన్నావా ఎంతవరకూ చదువుకున్నదో?" మిత్రుడి సందేహం తీర్చుదామన్న సదుద్దేశంతో మూర్తి అడిగాడు.

"అబ్బే. ఊరికే అడుగుతున్నాను—నిజంగా వెళ్ళి అడక్కురోయ్! అసలే కొంటి వెధవవి నువ్వు!"

"పోనీలే. అడగనులే. కరణంగారమ్మాయి అని విన్నాను!" మూర్తి జవాబిచ్చాడు. ఇద్దరూ మరో కాస్సేపు కబుర్లు చెప్పుకుని పెళ్ళివారింటికి తిరిగి బయలు దేరారు చీకటి పడే వేళకి.

భోజనాల దగ్గర ఆ అమ్మాయి ప్రత్యక్షమైంది. నెయ్యి వడ్డిస్తోంది. మెడలో నాలుగు పేటల గొలుసు, ఒంటిపేట గొలుసులు రెండు, చేతులకు మూడు జతల బంగారపు గాజులు, కాళ్ళకు పట్టా గొలుసులు, యింకా ముక్కు పుడక, రవ్వల దుద్దులు, అన్నీ వున్నాయి. తలంటి పోసుకున్న జుట్టు కాబోలు, ముడివేసుకుంది. సన్నని నడమూ విశాలమైన వక్షస్థలం, పొడుగాటి బలమైన శరీరం

పెద్ద పెద్ద కళ్లు. కాటుక పెట్టుకుంది. ఆ సమయంలో ఆ అమ్మాయిని చూస్తున్న రఘుకి ముద్ద మింగుడు పడలేదు. అతని వద్దకు వచ్చేసరికి మరింత సిగ్గు పడుతూ వడ్డించింది నెయ్యి.

"కరణంగారింట్లో మీ యిద్దరికీ మంచాలు వేయించాను. వెళ్ళి పడుకోండర్రా!" పెత్తల్లి తాయారమ్మ చెప్పింది.

"కరణంగారింట్లోనా!" సందేహంగా అడిగాడు రఘు.

"మరే...నీ కాబోయే మామగారు–"నవ్వుతూ అన్నది.

"సరెలే. నీ కెప్పుడూ అదే గొడవ. చూసిన పిల్లనల్లా నాకే అంటగట్టుతా నంటావ్."

"ఏ.? ఆ పిల్లకేం? బంగారపు బొమ్మ. ఎంత కట్నమయినా యిస్తాడు నువు చేసుకుంటానంటే." ఇంతలోకే లోపలనుంచి కేక వినపడగానే ఆమె వెళ్ళిపోయింది.

రఘు, మూర్తీ, యిద్దరూ కరణంగారింటి కెళ్లేరు పడుకోవడానికి. వరండాలో మంచాలు వేశారు.

"రండి బాబూ!" ఊరికి కరణం, పిల్లకి తండ్రి, గ్రామానికి మోతుబరి, అయిన మల్లపరాజుగారు యిద్దరినీ ఆహ్వానించాడు.

"ఆహాఁ...పాపం మీకు శ్రమ యిచ్చారు మావాళ్ళు—" గౌరవంకోసం అన్నాడు రఘు.

"అబ్బే! ఇంకా నయం! అతిథుల్ని ఆదరించడం కంటె గొప్పభాగ్యం ఏమున్నది? పైగా పెళ్ళివారింట్లో మీకు నిద్రపట్టదని ప్రత్యేకంగా మీ పెత్తండ్రిగారు చెప్పినమీదట వెంటనే యిక్కడ వేయించే ఏర్పాటు చేశాను."

"చాలా కృతజ్ఞులం!" మూర్తి అన్నాడు.

"అలాగే మరీ...తమ తండ్రిగారు మాకు ప్రాణస్నేహితులు—" రఘువంక చూస్తూ ప్రారంభించాడు మల్లపరాజు. కాస్సేపు లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు.

"వివాహం చేసుకునే వుద్దేశం ఏమయినా వున్నదా?" కరణం అతి వినయంగా అడిగాడు రఘుని. రఘుకి గుండె ఆగినంత పనయింది.

"హుఁ..." నవ్వాడు అంతే. మల్లపరాజు పొంగిపోయి బుర్రలో ఏదో లెక్కవేసుకున్నాడు.

తెల్లవారింది. ఆ అమ్మాయి రెండు చెంబులతో నీళ్లు తీసుకొచ్చి అరుగుమీద పెట్టడం చూశాడు రఘు.

"నీళ్ళు...అక్కడే...వున్నాయ్." సిగ్గుతో తల వంచుకు అన్నది.

"సరేలెండి" ఖంగారుగా అన్నాడు రఘు కూడా. ఆ అమ్మాయి వెడుతూ వెడుతూ అతని వైపు రెండుసార్లు చూసింది. ఒక్కసారి చిరునవ్వు పెదవులమీద మెరిపించి అదో విధంగా పూరిస్తూ చటుక్కున హాలులోకి వెళ్ళిపోయింది.

రఘు అలాగే చూస్తూ వుండిపోయాడు ఆ అమ్మాయి వెళ్ళినవైపు. మూర్తి యిదంతా కనిపెట్టుతూనే వున్నాడు ముసుగుపెట్టి దొంగనిద్దర నటిస్తూ.

"ఏం? గుండె ఆగిపోయిందా?"అడిగాడు మృదువుగా. "ఛ వెధవ భాషా నువ్వూనూ హృదయం బద్దలైందని అనాలి."

"మరమ్మతుకు అవకాశం లేదా?"

"ఇంచుమించు అంతే అనుకో. మనస్సూ, హృదయం, అన్నీ ఆ అమ్మాయి గుంజేసుకుంటున్నదిరా. కాని చదువుకున్న పిల్లను చేసుకోవాలని నాకెంతో కాంక్షరా!" మొహం కడుక్కుంటూ అన్నాడు రఘు.

"తువ్వాలిదిగో" అంటూ అమ్మాయి మళ్ళీ తయారు! వెనక్కితిరిగి చూశారిద్దరూ ఒక్కసారి.

"ఈ అమ్మాయి మన మాటలు వినడం లేదు కదా?" ఇంగ్లీషులో అన్నాడు మూర్తి. ఒక్కసారి తలఎత్తి అతనివైపు చూసింది.

"ఆఁ... ఇంగ్లీషు వొచ్చి చావదుగా యీ అడివి మృగానికి!." వెతుక్కోకుండా సమాధానమిచ్చాడు రఘు. అతనివైపు కూడా ఒకసారి చూసింది. "అవును! తనను గురించే కాబోలు! ఏదో ఇంగ్లీషులో అంటున్నారే! అవును మరి అనుకోరూ?" అని తనలో తాననుకుని ఆ అమ్మాయి తిరిగి వెళ్ళిపోయింది.

"మన నాంచారమ్మ కాఫీ పట్టుకొస్తోంది రోయ్!" రఘు అన్నాడు మూర్తితో, ఆ అమ్మాయి వస్తూవుండటం చూసి. ఆ అమ్మాయి కాఫీ బల్ల మీద పెట్టింది.

"సాంచారమ్మ! తననేకాబోలు అంటున్నారు" మనసులోనే అనుకుంది.

"కాఫీ...టీ...సుకోం...డి" సిగ్గుపడుతూ అన్నది.

"అలాగేలెండి ఎందుకీ శ్రమంతా మీకు!" మర్యాదకోసం అన్నాడు రఘు.

"శ్రమ...ఏముంది! పెళ్ళివారింట్లో మీకు పొద్దెక్కిగాని కాఫీలందవు!" యీమాటు చకచకా అనేసింది సిగ్గు కొంచెం వదలి.

"మీ నాన్నగారు—" రఘు అడిగాడు ఆయన ఎంతసేపటికీ కనబడకపోయేసరికి.

"కాలవకి వెళ్ళారు." ముక్తసరిగా సమాధానమిచ్చింది.

"సరేలెండి." ఇద్దరూ కాఫీ సేవించారు. బాదంచెట్టుక్రింద తులసికోట చుట్టూ ప్రదక్షిణం చేస్తోంది ఆ అమ్మాయి. ఇద్దరూ చూస్తూనేవున్నారు.

"ఈ అడివి మృగాన్ని నా కిస్తారట! మా పెద్దమ్మ యీ అమ్మాయిని చేసుకోమని మా నాన్నకు సిఫార్సు పైగా!" బాదంకాయలు ఏరుకుంటూ అన్నాడు రఘు పక్కనే నుంచున్న మూర్తితో ఇంగ్లీషులో. ఆ అమ్మాయి యిటు తిరిగిచూసి మళ్ళీ ప్రార్థనలో నిమగ్నురాలయింది.

భోజనాలయ్యాక యిద్దరూ వచ్చి మళ్ళీ వాళ్ళ య్యింట్లోనే మకాం వేశారు. పేక ఆడుతున్నారు. వరండాలో బల్లమీద ఏదో ఇంగ్లీషు పుస్తకం కనబడింది; తీసి చూశాడు రఘు. కవరుమీద "మిస్. రజని, ఇంటర్ సీనియర్" అని వ్రాసి వున్నది. అందులో ఎవరిదో ఒక అమ్మాయిది ఫోటో వున్నది. "చాలా అందంగా వున్నది. చక్కగా చదువుకున్నది కూడాను. ఆటువంటి పిల్ల తనకి భార్య కాకూడదూ?"—మనసులో వూహించుకున్నాడు ఏమేమో.

"ఆ పుస్తకం...యిస్తారా?" అడిగింది. పాపం, బొమ్మలు చూడటం సరదా కాబోలు. జాలి పడ్డాడు రఘు.

"ఆ...మీ బంధువులా అండి యీ రజని అనే అమ్మాయి?" సందేహం వచ్చింది.

"మరే" అంది అమ్మాయి.

"ఆవిడ ఇంటర్ చదివినట్టున్నారు!"

"మరే. ఏం?" అని అడిగింది. రఘు ఏమని జవాబివ్వగలడు?

"ఎబ్బే. వూరికేనే" అంటూ పత్రిక చేతి కిచ్చాడు. ఫోటో క్రిందపడింది. ఇద్దరూ వంగారు. ఇద్దరిచేతులూ ఫోటోమీద ఒకేసారి పడ్డాయి. ఆ అమ్మాయి సిగ్గుపడి చప్పున చేతులు వెనక్కి తీసుకుంది. రఘు ఒకసారి ఫోటోవంక చూసి ఆ అమ్మాయి కిచ్చాడు.

• • •

రఘు ఆ రాత్రి భోజనాలయ్యాక ఆరుబయట మంచంమీద కూర్చున్నాడు.

"ఏరా! నిజంగా ఆ పిల్లను చేసుకుంటావుటరా?"

"ఏ పిల్లని?"

"కరణంగారమ్మాయిరా. దబ్బపండులాంటి పిల్ల. ఒంటినిండా బంగారం. ఒక్కతే ఒక్క గారాబు కూతురు. తలిదండ్రులకు ఆ పిల్లంటే పంచప్రాణాలూనూ!"

"అందం, డబ్బు, అంతే నీకు కావాల్సింది!" విసుక్కున్నాడు రఘు.

"అయితే యింకేంగావాలిరా? డబ్బు నాన్నకి కావాలి—అందం, చదువు నీకు కావాలి!"

"అదే నేనూ అనేది. అందానికేం అందం వున్నది. కాని పొట్టపొడిచినా అక్షరంముక్క లేదు—" ఇంకా మాట పూర్తిచేయలేదు రఘు.

'చాలు చాల్లేరా, నవ్విపోయేరు! చదువు లేదంటావేమిట్రోయ్! ఆ పిల్ల ఇంటర్ ఫస్టుక్లాసులో మొన్ననే ప్యాసయితే!" అంటూ పెత్తల్లి బుగ్గలు పొడిచింది.

"ఆ— ఇంటర్!" తెల్లబోయాడు. "ఆ అమ్మాయి పేరు?" మళ్ళీ అడిగాడు.

"రజని అందాల రజని" వర్ణించింది అంతు లేకుండా. రఘుని జుట్టుపట్టుకు బరబర లాక్కెళ్ళాడు మూర్తి కరణంగారింటికి పడుకోవడానికి.

• • •

"అడవి మృగాన్ని నిజంగా నేనే!" పెళ్ళి జరుగుతుండగా చీటీమీద వ్రాసిపంపాడు రఘు.

"మరి ఆటువంటి మృగంతో నేను జన్మంతా ఎలా గడపగలనో?" రజని దగ్గిరనుంచి జవాబు ఘాటుగా వచ్చింది. ★